బల్దియా.. బస్తీ కార్యాచరణ

స్వచ్ఛ హైదరాబాద్ లక్ష్యంగా చర్యలు

జీహెచ్ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో బస్తీ కార్యాచరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బస్తీ కార్యాచరణను అమలు చేస్తున్నారు. మహా నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు బస్తీ స్థాయి నుంచే పారిశుద్ధ్య సిబ్బంది సమర్థవంతంగా పనిచేసేలా బస్తీ కార్యాచరణను ప్రారంభించారు. ప్రతి రోజు చెత్త సేకరణ 100 శాతం జరిగేలా చూసేలా ఉన్నతాధికారులకు జీహెచ్ఎంసీ ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేసింది. ఇంటింటికీ వెళ్లి వంద శాతం చెత్త సేకరణ చేసే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు బస్తీ కార్యాచరణను అమలు చేస్తున్నారు. ఇందులో వారం రోజుల్లో వివిధ అంశాలపై ప్రధానంగా దృష్టి సారించనున్నారు. మొదటి రోజు బస్తీ మీటింగ్, రెండో రోజు సాట్ వాహనాలకు అనుసంధానం చేయని ఇళ్లను గుర్తించడం, మూడవ రోజు బస్తీల్లో ర్యాలీలు నిర్వహించడం, 4వ రోజు చెత్త సేకరణ, పారిశుద్ధ్య నిర్వహణపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించి, 5వ రోజు గుర్తించిన ప్రాంతాల్లో ముగ్గులు వేయడం, 6వ రోజు టౌన్ వెండింగ్ కమిటీ మీటింగ్, 7వ రోజు ముగింపు సందర్భంగా అధికారులు, పారిశుద్ధ్య విభాగం సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించేలా కార్యాచరణను రూపొందించారు. జీహెచ్ఎంసీ పరిధిలో 100 శాతం ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేసి, రోడ్లపై ఎక్కడ చెత్తా చేదారం వేసేందుకు అవకాశం లేకుండా చేయడమే లక్ష్యంగా దీన్ని నిర్వహించనున్నారు. ఇందులో శుక్రవారం జీహెచ్ఎంసీ పరిధిలో మొదటి రోజు 1604 ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించామని అధికారులు తెలిపారు. ఇందులో స్వయం సహాయక సంఘాల సభ్యులతో పాటు చెత్త సేకరించే ఆటోల డ్రైవర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మూస పద్ధతులను వీడాలి

మహిళల సాధికారతపై టీ - హబ్‌లో ప్రత్యేక చర్చా కార్యక్రమం

టీ-హబ్‌లో వైఎఫ్ఎల్ఓ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా ప్రముఖులు

కొండాపూర్, ఏప్రిల్ 12 : మూస పద్ధతులను వీడాలని యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (వైఎఫ్ఎల్ఓ) ఆధ్వర్యంలో నాలెడ్జ్ సిటీలోని టీ - హబ్‌లో విమెన్ ఇన్ స్పోర్ట్స్, ఆన్‌స్క్రీన్, బియాండ్ అనే అంశాలపై పలువురు మహిళా ప్రముఖులతో వైఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ రిధి జైన్ చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ ట్రావెలర్, ఫ్యాషన్ డిజైనర్ డాక్టర్ మారల్ యూజర్లూ, సీజన్డ్ డెజర్ట్ మారథాన్ ఎంఎస్ మిచెల్ కకడే, లిమ్కా అండ్ గిన్నిస్ బుక్ హోల్డర్, మాజీ ఒలంపియన్, టేబుల్ టెన్నిస్ చాంపియన్ నేహా అగర్వాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు, అధిగమించాల్సిన సవాళ్లు, మారుతున్న పరిస్థితులు, అవకాశాలు తదితర విషయాలపై చర్చించారు.

విద్యార్థులకు ఏఐపై శిక్షణ



నగరంలోని ఇంజినీరింగ్ స్టాప్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌పై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఇంజినీరింగ్ విద్యార్థులు.

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన, భారత ప్రభుత్వ నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఇంజినీరింగ్ స్టాప్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లర్నింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం కళాశాల విద్యార్థులకు ఏఐ, ఎంఎల్‌లకు సంబంధించిన అంశాలపై నిపుణులు శిక్షణనిచ్చారు. నగరంలోని వివిధ కళాశాలల నుంచి 200మంది ఇంజినీరింగ్ విద్యార్థులు హాజరయ్యారని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వర్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో జోగినపల్లి భాస్కర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ నుంచి ఏఐ, ఎంఎల్ అసోసియేట్ ప్రొఫెసర్ జె.మరియా శాంతి, దుర్గా భవానీ, ఈఎస్సీఐ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ సెల్ హెడ్ పి.సాయికిశోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

గోల్నాక మార్కెట్‌ను ముంచెత్తిన.. తాగునీరు

గంటల తరబడి రోడ్డుపై పారుతున్నా.. పట్టించుకోని అధికారులు

అంబర్‌పేట, ఏప్రిల్ 12 : ఒక పక్క మంచినీటి కోసం బిందెలతో కోట్లాడుతున్న ఘటనలు కనబడుతుంటే మరోపక్క అదేనీరు రోడ్డుపై వృథాగా ప్రవహిస్తున్నది. తాగునీటి కోసం తంటాలు పడే పరిస్థితి దాపురిస్తున్న సమయంలో అధికారుల నిర్లక్ష్యానికి మంచినీరు గంటల పాటు రోడ్డుపై పారింది. రోడ్డులోపల మంచినీటి పైప్‌లైన్ పగలడంతో శుక్రవారం ఉదయం నల్లకుంట డివిజన్, వాటర్‌వర్క్స్ శివం సెక్షన్ పరిధిలోని గోల్నాక కూరగాయల మార్కెట్‌లో తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతూ మార్కెట్ మొత్తాన్ని ముంచెత్తింది. ఈ విషయం అక్కడ పనిచేసే లైన్‌మెన్ దగ్గర నుంచి అధికారుల వరకు తెలిసినా పట్టించుకోలేదు.

కిక్వషన్..?

సోషల్ మీడియా వేదికగా.. కిషన్‌రెడ్డిపై సెటైర్లు

ఏదీ స్వగతం..? ఆద్యంతం మోదీ జపం

మూడు సార్లు ఎమ్మెల్యే, కేంద్రమంత్రిగా ఒరగబెట్టిందేమిటీ?

శక్తిగల పదవిలో ఉన్నా.. ప్రజలకోసం ఏంచేశావ్.?

ఎమ్మెల్యేగా అంబర్‌పేటకు, ఎంపీగా సికింద్రాబాద్‌కు చేసింది శూన్యం

బీజేపీ ప్రచారంలో కనిపించని జోష్

బీఆర్ఎస్ హయాంలోనే మారిన అంబర్‌పేట, సికింద్రాబాద్ నియోజక వర్గాల ముఖచిత్రం

లోప్రొఫైల్‌తో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు

లష్కర్‌లో పజ్జన్న గెలుపు ఖాయమంటున్న సికింద్రాబాద్ పార్లమెంట్ ఓటర్లు

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రిగా సికింద్రాబాద్ ప్రజలకు చేసిన అభివృద్ధి లేకపోవడంతో ఎన్నికల ప్రచారంలో ఏం చెప్పాలో తెలియక కిషన్ రెడ్డి మోదీ జపం చేస్తున్నారని సోషల్ మీడియాలో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. మూడుసార్లు ఎమ్మెల్యే.. రెండు సార్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు. ప్రస్తుతం సికింద్రాబాద్ ఎంపీ.. కేంద్రమంత్రిగా బాధ్యతలు.. అంత గొప్ప శక్తి ఉన్న వ్యక్తి తనను గెలిపించిన ప్రజల కోసం ఎంతైనా చేయవచ్చు. కానీ ఏనాడు ప్రజలను పట్టించుకోలేదని సోషల్ మీడియాలో నెటిజన్లు మండిపడుతున్నారు. సికింద్రాబాద్ ఎంపీగా కేంద్రం నుంచి తీసుకొచ్చిన నిధులు ఎంత? చేసిన అభివృద్ధి పనులు ఎక్కడ? ఒక్కసారి చూపించండి అంటూ ఓటర్లు ప్రచారానికి వస్తున్న బీజేపీ నాయకులను నిలదీస్తున్నారు. కనీసం ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కూడా అంబర్‌పేటను పట్టించుకున్న దాఖలాలు లేవని ఆ నియోజకవర్గ ప్రజలు తెలుపుతున్నారు. కిషన్ రెడ్డి మోదీ జపం చేయడం తప్ప.. అతను చేసిన అభివృద్ధిపై మాట్లాడకుండానే ప్రచారం సాగిస్తున్నారని మండిపడుతున్నారు.

ఎమ్మెల్యేగానూ అంతే..!

కిషన్ రెడ్డి సారథ్యంలో అంబర్‌పేట అభివృద్ధి తిరోగమనం చెందింది. 2004లో హిమాయత్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పుడు ఇదే నియోజకవర్గంలో అంబర్‌పేట ఉండేది. 2009, 2014లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. మూడు సార్లు ఎమ్మెల్యేగా అవకాశమిచ్చిన అంబర్‌పేట నియోజకవర్గం ప్రజల కోసం ఏ ఒక్కపని కూడా చేయలేదు. ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నిత్యం తాగునీటి ఇబ్బందులు, ముంపు సమస్యలు, సరైన రోడ్లు లేక సతమతమవుతున్న ప్రజలను ఆయన ఏనాడు పట్టించుకోలేదని ఓటర్లు పేర్కొంటున్నారు. ఇరుకు రోడ్లతో పద్మవ్యూహాన్ని తలపించే ట్రాఫిక్‌తో ఇక్కట్లు, శ్మశాన వాటికలు లేక కష్టాలు పడుతున్న నియోజకవర్గం ప్రజల దుస్థితిని అర్థం చేసుకోలేదు. అంబర్‌పేట అంటే ఒక స్లమ్ ప్లాంతంగా దర్శనమిచ్చేది. వరదలొచ్చినప్పుడు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమనే పరిస్థితి ఆనాడు ఉండేది. ఎమ్మెల్యే నిధులను సైతం సరిగా వినియోగించలేదని ఆయనపై విమర్శలు ఉన్నాయి.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

2004 నుంచి 2018 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయం లోనూ కిషన్ రెడ్డి చెప్పుకోదగిన అభివృద్ధి చేయలేకపోయారని ఓటర్లు అంటున్నారు. 2018లో బీఆర్ఎస్ నుంచి కాలేరు వెంకటేశ్ గెలిచిన తర్వాత అంబర్‌పేట ముఖచిత్రం మారింది. సమస్యలకు నిలయంగా ఉన్న నియోజకవర్గం అభివృద్ధిలో పరుగులు తీసింది. రూ.441 కోట్ల అభివృద్ధి పనులు చేశారు. తాగునీరు, ముంపు సమస్య పరిష్కారంతో పాటు అద్దంలా మెరిసేలా రోడ్లు, ఆహ్లాదకరమైన పార్కులు, ట్రాఫిక్ నివారణకు బిడ్జిలు, బస్తీ దవాఖానలు ఇలా ఒక్కటేమిటీ సకల అభివృద్ధి పనులు బీఆర్ఎస్ హయాంలోనే జరిగాయి.

ఇదిగో పద్మారావు చేసిన అభివృద్ధి..!

అన్ని వర్గాల అభివృద్ధిపై పద్మారావు దృష్టి సారించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో రూ.800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు.

- విద్యా రంగంలో చేయూతకు కృషి చేస్తూ.. రాష్ట్రంలో మొదటిసారిగా జూనియర్, డిగ్రీ కాలేజీ సీతాఫల్ మండి ప్రభుత్వ స్కూల్‌లో మంజూరు చేయించారు. ఇందు కోసం రూ.29.75 కోట్ల నిధులను విడుదల చేయించారు. వీటిలో జూనియర్ కాలేజీకి రూ.6.30 కోట్లు, డిగ్రీ కాలేజీకి రూ.9 కోట్లు, హైస్కూల్‌కు రూ.14.45 కోట్లు మంజూరు చేయించారు.
- సికింద్రాబాద్ పరిధిలో 5 స్కూళ్లను ఎంపిక చేసి రూ.50 లక్షల చొప్పున నిధులను మంజూరు చేయించారు.
- నిరుద్యోగులకు స్కిల్స్ శిక్షణ ఇచ్చేందుకు సెట్విన్ కేంద్రాలను కూడా ఏర్పాటు చేశారు. దీని ద్వారా 3,500 మందికి ఉపాధి కల్పించారు.
- మాతా శిశు సంక్షేమమే పరమావధిగా రూపొందించిన కేసీఆర్ కిట్ పథకం సికింద్రాబాద్ నియోజకవర్గంలో సంతృప్తికరంగా అమలైంది.
- తెలంగాణ డయాగ్నొస్టిక్ సెంటర్‌లను సీతాఫల్‌మండి, అంబర్‌నగర్, అడ్డగుట్టలో నెలకొల్పారు.
- సీతాఫల్‌మండి ప్రభుత్వ కుట్టి వెల్లోడి ఆసుపత్రి 75 పడకల స్థాయికి పెంచి కొత్త భవనాల నిర్మాణానికి రూ.9.25 కోట్ల నిధులను మంజూరు చేయించారు.
- రవీంద్రనగర్, చింతబావి, దుడ్‌బావి, ఇందిరానగర్, అంబర్‌నగర్ ప్రాంతాల్లో బస్తీ దవాఖానలను ఏర్పాటు చేశారు.
- అడ్డగుట్ట, మెట్టుగూడ, తార్నాక, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్లలో సుమారు రూ.21 కోట్ల నిధులతో వివిధ పనులను చేపట్టేల ప్రతిపాదనలు చేపట్టారు.
- శ్మశాన వాటికలు, పార్కులు, నర్సరీలు ఏర్పాటు చేశారు.

బీఆర్ఎస్ హయాంలో.. మారిన అంబర్‌పేట ముఖచిత్రం.!

- రూ.441 కోట్ల అభివృద్ధి పనుల్లో భాగంగా రూ.130 కోట్లతో 784 పనులు చేపట్టారు. అందులో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, వీడీసీసీ రోడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.
- రూ.56 కోట్లతో డ్రైనేజీ, పైపులైన్ పనులు చేశారు.
- ఎస్ఎన్‌డీపీలో భాగంగా రూ.60 కోట్లతో అభివృద్ధి పనులు చేశారు.
- ముంపు సమస్య తలెత్తకుండా ఫీవర్ ఆసుపత్రి ఎదురుగా రిటర్నింగ్ వాల్ నిర్మించారు. మోహినీ చెరువు, పటేల్ నగర్, ప్రేమ్‌నగర్, బాపునగర్ ప్రాంతాల్లో నాలా పనులు చేపట్టారు. పలు ప్రాంతాల్లో వాటర్‌లాగింగ్ సమస్య లేకుండా చర్యలు తీసుకున్నారు.
- రూ.100 కోట్లతో సీఆర్ఎంపీ రోడ్ల పనులు చేపట్టారు. అందులో భాగంగా ఓయూ నుంచి బర్కత్‌పుర-వైఎంసీఏ వరకు రోడ్లను సుందరీకరణ చేశారు.
- మహేశ్వర్ పరమేశ్వర్ థియేటర్ నుంచి కాచిగూడ రైల్వే స్టేషన్ వరకు, ఫీవర్ ఆసుపత్రి నుంచి తిలక్‌నగర్ వరకు, ఓయూ చౌరస్తా నుంచి చేనంబర్ వరకు, శ్రీరామ థియేటర్ నుంచి అలీ కేఫ్ మీదుగా డోల్నాక వరకు సీఆర్ఎంపీ రోడ్లను అందుబాటులోకి తీసుకువచ్చారు.
- అంబర్‌పేట ప్రజల ఆహ్లాదం కోసం అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సూచనలతో రూ.20 కోట్లతో థీమ్ పార్క్స్ ఏర్పాటు చేశారు.
- బర్కత్‌పుర హౌసింగ్ బోర్డు పార్కు జిమ్, షటిల్ కోర్ట్, ప్లే ఏరియా తదితర వసతులతో ఏర్పాటు చేశారు. దీంతో పాటు టీఆర్‌టీ పార్కు, సోమసుందర్ నగర్ పార్కులను ఏర్పాటు చేశారు.
- అంబర్‌పేట నుంచి నాగోల్‌కు షార్ట్ కట్ రూట్‌లో భాగంగా అలీకేఫ్ చౌరస్తా మీదుగా రూ.60 కోట్లతో 120 ఫీట్ల రోడ్డును అభివృద్ధి చేశారు.
- మిషన్ కాకతీయలో భాగంగా రూ.10 కోట్లతో మోహినీ చెరువు సుందరీకరణ పూర్తి చేశారు.
- భారీ వర్షాలు కురిసే సమయంలో ట్రాఫిక్ సమస్య ప్రధానంగా ఏర్పడే ముసారంబాగ్ నుంచి దిల్‌షుక్‌నగర్ వెళ్లే మార్గం మధ్యలో దేశంలోనే అత్యాధునికంగా బ్రిడ్జి నిర్మాణ పనులకు ఆనాడు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.52 కోట్లతో ఈ అభివృద్ధి పనులు చేస్తున్నారు.
- చాదర్‌ఘాట్ దగ్గర మరో బ్రిడ్జి నిర్మాణం రూ.42 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు.
- అంతేకాదు ముస్లిం సమాజం కోసం శ్మశాన వాటిక స్థలంలో భాగంగా కోట్ల రూపాయల విలువజేసే మూడు ఎకరాల స్థలాన్ని అప్పగించారు.
- హిందువుల కోసం రూ.3 కోట్లతో శ్మశాన వాటిక పనులు జరుగుతున్నాయి.
- రోడ్ల వెంట సుందరీకరణ కోసం రూ.40 లక్షలతో వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేశారు.
- శివం రోడ్‌లో రూ.40 లక్షలతో ఏసీ బస్టాండ్ నిర్మించారు.
- నారాయణగూడ ఫ్లైఓవర్ కింద ఇబ్బందులు పడుతున్న వ్యాపారుల కోసం మార్కెట్ భవనం ఏర్పాటు చేశారు.

అత్యాధునిక నిర్మాణాలు..!

- రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణానికి ప్రాముఖ్యతను కల్పిస్తూ రూ.14 కోట్ల మేర నిధులను మంజూరు చేయించి 846 పనులను చేపట్టారు.
- మంచినీటి సరఫరా, సీవరేజీ ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.
- రూ.వంద కోట్లకుపైగా నిధులతో రిజర్వాయర్ల పునర్నిర్మాణం చేపట్టారు.
- సీతాఫల్‌మండిలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్, బోయ బస్తీ, మధురనగర్ కాలనీలో ఫంక్షన్ హాల్‌లను నిర్మించి పేదలకు అధునాతన హంగులతో కల్యాణ వేదికలను అందించారు.
- అడ్డగుట్ట, లాలాపేటలో కొత్తగా మరో రెండు ఫంక్షన్ హాల్స్ నిర్మాణంలో ఉన్నాయి.
- తుకారం గేటు వద్ద రూ.73 కోట్లతో ఆర్‌యూబీ నిర్మించారు. దీంతో సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాలతో పాటు మల్కాజిగిరి, కంటోన్మెంట్ నియోజకవర్గాల ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి.
- మెట్టుగూడలో రూ.30 కోట్లతో, మాణికేశ్వరినగర్‌లో రూ.20 కోట్లతో రెండు ఆర్‌యూబీల నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతి ఇప్పించారు.
- రూ.6.10కోట్లతో అంతర్జాతీయ స్థాయిలో స్విమ్మింగ్ పూల్ నిర్మాణాన్ని ప్రారంభించారు.

ఇంటికే రాములోరి కల్యాణ తలంబ్రాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : భద్రాది సీతారాముల కల్యాణ తలంబ్రాలను భక్తులకు ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా అందిస్తామని గ్రేటర్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ సీటీఏ మధుసూదన్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే తలంబ్రాలు చిరునామాలకు చేరుస్తామని తెలిపారు. ఈ నెల 18వ తేదీ వరకు బుకింగ్ చేసుకునే అవకాశం ఉందని వివరించారు. హైదరాబాద్, సికింద్రాబాద్ రీజియన్‌లో 90 లాజిస్టిక్ కేంద్రాల్లో బుకింగ్ సౌకర్యం కల్పించినట్టు తెలిపారు. మరింత సమాచారం కోసం 9154298736, 9154298827 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సాహితీ వేత్త శేషాచార్యులు అనారోగ్యంతో మృతి

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తేతెలంగాణ) : సాహితీ వేత్త ప్యారక శేషాచార్యులు గురువారం రాత్రి తుది శ్వాస విడిచారు. గత కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. మెదక్ జిల్లా శివంపేటకు చెందిన ఆయన ఉపాధ్యాయుడిగా పనిచేసి పదవీ విరమణ పొందారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. సికింద్రాబాద్ న్యూ బోయిగూడలో నివాసముంటూ ప్రముఖ సాహితీ వేత్తగా పేరుగాంచారు. మాతృశ్రీ, గురూపదేశం, ఏకలవ్య, ప్రపత్తి నిర్వేదం, కాకతాళీయం, శిఖి ముఖాలు శృంగార వాసంతం, ప్లేటో వాల్మికీయం, శృంగార గంగ వంటి రచనలు చేశారు. ఆయన మరణం పట్ల పలువురు సాహితీ వేత్తలు నివాళులర్పించారు.

సైబర్ నేరాలపై విస్తృత అవగాహన

సోషల్ మీడియా, సినిమా థియేటర్స్, విద్యా సంస్థల వద్ద కార్యక్రమాలు

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : సైబర్ నేరాలలో మోసపోతున్న వారిలో ఎక్కువగా విద్యావంతులే ఉంటుండడంతో పోలీసులు దీనిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పార్ట్‌టైమ్, ట్రేడింగ్ పేరుతో జరుగుతున్న సైబర్‌నేరాలలో ఎక్కువగా ఆర్థిక నష్టం కల్గుతుంది. ఈ నేపథ్యంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, ప్రైవేట్, ప్రభుత్వ ఉద్యోగుల వద్దకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా తీసుకువెళ్లేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రస్తుతం కొనసాగిస్తున్న అవగాహన కార్యక్రమాలకు అదనంగా మరిన్ని కార్యక్రమాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. సైబర్ నేరాలలో కూడా రోజుకో కొత్త తరహా మోసం బయటపడుతుండటంతో అందుకు తగ్గట్టుగానే అవగాహన కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. దీనికి సోషల్ మీడియా, సినిమా థియేటర్స్, విద్యా సంస్థల వద్ద విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించే ఏర్పాట్లు చేస్తున్నారు.

ఖనిజ సంపదను వెలికితీయాలి

జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్

మన్సూరాబాద్, ఏప్రిల్ 12 : శిక్షణ సమయంలో నేర్చుకున్న విజ్ఞానంతో దేశంలోని ఖనిజ సంపదను వెలికి తీసేందుకు భూవైజ్ఞానిక శాస్త్రవేత్తలు కృషి చేయాలని జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్ జనార్దన్ ప్రసాద్ తెలిపారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా రిక్రూట్ చేయబడి ఎల్బీనగర్, బండ్లగూడలోని జీఎస్ఐటీఐలో శిక్షణ పొందిన 47వ బ్యాచ్‌కు చెందిన 84మంది భూవైజ్ఞానిక శాస్త్రవేత్తల ఓరియంటేషన్ కోర్సు ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం జీఎస్ఐటీఐ ప్రాంగణంలోని ఎంఎస్ కృష్ణన్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో హెడ్‌మిషన్-వీ డాక్టర్ మాథ్యూజోసెఫ్ హాజరై శిక్షణ పొందిన ట్రైనీ అధికారులకు సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్‌ప్రసాద్ మాట్లాడుతూ దేశంలోనే జీఎస్ఐ అత్యుత్తమ జియోసైన్స్ ఆర్గనైజేషన్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్యామ్‌ప్రసాద్ భూటియా, ప్రజాసంబంధాల అధికారి మల్లేశ్ గంజి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న భూవైజ్ఞానిక శాస్త్రవేత్తలతో జీఎస్ఐ సౌథెర్న్ రీజియన్ డైరెక్టర్ జనరల్ జనార్దన్‌ప్రసాద్ తదితరులు

జూలై 8,9 తేదీల్లో ఏఐ సమ్మిట్

సిటీబ్యూరో, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీపై తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ సమ్మిట్‌ను నిర్వహిస్తోంది. రాష్ట్ర ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్(ఐటీ అండ్ ఈసీ) శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణ గ్లోబ్ ఏఐ సమ్మిట్‌ను చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంట ర్ (హెచ్ఐసీసీ) వేదికగా జూలై 8-9 తేదీల్లో నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

డబ్ల్యూపీవో అంబాసిడర్‌గా చక్రవర్తి

ఖైరతాబాద్, ఏప్రిల్ 12 : వరల్డ్ ప్యాకేజింగ్ ఆర్గనైజేషన్ గ్లోబల్ అంబాసిడర్‌గా కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) తెలంగాణ ఫార్మా, లైఫ్ సైన్సెస్ సభ్యులు చక్రవర్తి ఏవీపీఎస్ ఎంపికయ్యారు. ఫార్మాస్యూటికల్ మ్యానుఫాక్చరింగ్, ప్యాకేజింగ్ విభాగంలో అపార అనుభవం ఉన్న చక్రవర్తి ప్రపంచ వ్యాప్తంగా భారత ఫార్మా రంగం విస్తరించేందుకు విశేషంగా కృషి చేశారు. ఫార్మా రత్న, యూఎంబీ, ప్యాకేజింగ్ లీడర్‌షిప్ తదితర అవార్డులను సైతం అందుకున్నారు.